


# కడప మనస్సాక్షి
PRGI Reg.No: APTEL/26/A0309
తెలుగు దినపత్రిక
KADAPA MANASSAKSHI - Telugu Daily

వైయస్ఆర్ కడప/అన్నమయ్య | ఎడిటర్ : వసంత శ్రీనివాసుల రెడ్డి | సంపుటి : 01 సంచిక : 150 | శనివారం, 13 జూన్ 2026 | పేజీలు : 4 | వెల.రూ.2/-




## 2027 జనాభా లెక్కల తర్వాత భారత ఎన్నికల ముఖచిత్రమే మారనుందా?

- లేటెస్ట్ స్టడీ ఏం చెబుతుందంటే?
- 2027 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్
- లోక్‌సభ సీట్లు 543 నుంచి 824కు పెరిగే అవకాశం ఉందన్న ఆర్థికవేత్తలు
- ఓటింగ్ పెంచేందుకు కీలక సూచనలు



## ఐక్యంగా పోరాడదాం



- మోదీ సర్కార్‌పై ప్రజల్లో ఆగ్రహం
- వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయం: రాహుల్ గాంధీ
- వచ్చే ఎన్నికల్లో పోలింగ్ నిష్పక్షపాతంగా జరగకపోవచ్చు
- విమర్శలనే విమర్శలు మింగే నీలకంఠుడిని నేను
- ఇండియా కూటమి మీటింగ్‌లో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు



## పోరాటం ఆగదు.. మోసాలను నిలదీస్తాం

- ఆ హామీలు ఏమయ్యాయి బాబూ?
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రెండేళ్ల 'నారాసుర' పాలన–రాష్ట్రానికి, ప్రజలకు వెన్నుపోటు.. ర్యాలీలు ప్రజాగ్రహానికి అద్దం పట్టాయి
- "రైతులను మోసం చేశారు, మహిళలను మోసం చేశారు
- యువతను మోసం చేశారు, విద్యార్థిని మోసం చేశారు.
- "ఈ రెండేళ్లలో రాష్ట్రం చూసింది అభివృద్ధి కాదు... పచ్చి అబద్ధాల ప్రచారం.

### అన్నీ తాకట్టు పెట్టేవాళ్లకు మాట్లాడే

# అర్హత లేదు

- డబుల్ ఇంజిన్ సర్కార్ ఫలితాలు చూస్తున్నాం
- దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం
- అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు
- 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో చంద్రబాబు



**అమరావతి**

స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి, ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని చంద్రబాబు గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి - మిగతా 3లో



## మళ్లీ మొదలైన ఎల్ నినో

- ఈ వర్షాకాలంలో మరింత బలపడే ఛాన్స్ : ఐఎండీ
- పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్ నినో పరిస్థితులు
- నైరుతి రుతుపవనాల కాలంలో ఇవి మరింత బలపడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ

## బంకుల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు

- సంక్షోభం వేళ కేంద్రం కీలక నిర్ణయం
- పశ్చిమాసియాలో అంతకంతకు ముదురుతున్న యుద్ధం
- హార్మూజ్ జలసంధి మూసివేతతో ముడి చమురు రవాణాకు ఇబ్బందులు

# గ్రామాల నుంచే నాయకత్వం రావాలి



- ప్రజలు మాకు కేవలం అధికారం ఇవ్వలేదు
- బాధ్యత అప్పగించారు: పవన్ కల్యాణ్
- కూటమి ఏర్పడింది బాధ్యతలు పంచుకునేందుకు
- జనసేన 21 స్థానాలకు పరిమితమైతే విమర్శించారు, కానీ వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించాం
- గ్రామ సమస్యలకు ఆ గ్రామంలోనే పరిష్కారం దొరకాలి

**అమరావతి**

"ఒక వ్యవస్థ బలహీనపడినప్పుడు కోల్పోయేది డబ్బు కాదు, ప్రజల నమ్మకం. వ్యవస్థ న్యాయం చేయకపోతే అన్నీ సమస్యలే. అహంకారం, విధ్వంసంపై ప్రజాస్వామ్యం సాధించిన చారిత్రక విజయం ఇది" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. కులాలు, ప్రాంతీయత పరిమితులు దాటితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఏపీ పునర్నిర్మాణం కోసమే కూటమి ఏర్పడిందని, ఇది అధికారం పంచుకోవడానికి కాదు, బాధ్యతలు పంచుకోవడానికి అని ఆయన చెప్పారు. తిరుపతి జిల్లా దామినేడు సమీపంలో 'రెండేళ్ల నమ్మకం–అభివృద్ధి, సంక్షేమం' నినాదంతో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తాను పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టాక - మిగతా 3లో

# రాష్ట్రవ్యాప్తంగా మోగిన బడి గంట




- తొలిరోజు పండుగ వాతావరణంలో స్కూళ్లకు పిల్లలు
- వేసవి సెలవుల అనంతరం తెరుచుకున్న పాఠశాలలు
- తొలిరోజు పండుగ వాతావరణంలో బడులకు పిల్లలు హాజరు
- కొత్తగా బడికి వచ్చిన చిన్నారులకు చాక్లెట్లు పంచిన టీచర్లు
- మంత్రి లోకేష్ శుభాకాంక్షలు

**అమరావతి**

వేసవి సెలవుల అనంతరం కొత్త విద్యా సంవత్సరం మొదలైంది. తొలిరోజు పండుగ వాతావరణంలో పాఠశాలలు తెరుచుకున్నాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో బడులకు హాజరయ్యారు. టీచర్లు వారిని ఆప్యాయంగా ఆహ్వానించారు. వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు నేడు పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్ద సందడి నెలకొంది. 2026 – 27 విద్యా సంవత్సరం తొలిరోజే, బడులకు పిల్లలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కర్నూలులో కొత్తగా బడికి వచ్చిన చిన్నారులను ఉపాధ్యాయులు ఆటపాటలతో ఆహ్వానించారు. నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపాన ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పునఃప్రారంభం పండుగ వాతావరణంలో జరిగింది. నంద్యాలకు చెందిన సేవా సంస్థ 'మన ఊరు – మన బడి– మన బాధ్యత' పేరిట బాలికలకు స్వాగతం పలికింది. డ్రమ్ములు - మిగతా 3లో

## నీట్ రీ ఎగ్జామ్‌లో మార్పులు

- రఫ్ వర్క్ పేజీల రెట్టింపు
- సమయాన్ని పెంచిన ఎన్‌టీఏ
- పరీక్ష ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత ఇన్విజిలేషన్ ప్రక్రియకు పెంచిన సమయం ఉపయోగపడుతుందని వెల్లడి
- రఫ్ వర్క్ కోసం ఇచ్చే పేజీలను రెట్టింపు చేసినట్లు వివరణ



# 2027 జనాభా లెక్కల తర్వాత భారత ఎన్నికల ముఖచిత్రమే మారనుందా?

దాదాపు 50 ఏళ్ల తర్వాత భారత ఎన్నికల వ్యవస్థలో అతిపెద్ద మార్పులకు తెరలేచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2027 జనాభా లెక్కల అనంతరం చేపట్టే డీలిమిటేషన్ ప్రక్రియ (నియోజకవర్గాల పునర్విభజన) దేశ రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేసే అవకాశం ఉందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో పాటు పార్లమెంటు సీట్ల సంఖ్య కూడా భారీగా పెరగొచ్చని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) కోసం ప్రముఖ ఆర్థిక వేత్తలు షమికా రవి, ముదిత్ కపూర్ ఈ స్టడీ చేశారు. ఈ అధ్యయనం ప్రకారం- డీలిమిటేషన్‌ను కేవలం జనాభా ఆధారంగానే కాకుండా పట్టణీకరణ, భాషా వైవిధ్యం వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకొని నిర్వహిస్తే అప్పుడు ఓటర్ల భాగస్వామ్యం కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.




### డీలిమిటేషన్ అంటే ఏంటి?

జనాభా మార్పులకు అనుగుణంగా పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల్ని పునర్నిర్మించడమే డీలిమిటేషన్. ప్రస్తుతం రాష్ట్రాల వారీగా లోక్‌సభ సీట్ల కేటాయింపు 1976లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ నుంచి యథాతథంగా కొనసాగుతోంది. 2001 జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గాల సరిహద్దులు మారినా, రాష్ట్రాలకు కేటాయించిన సీట్ల సంఖ్య మాత్రం మారలేదు. 2026 తర్వాత జరిగే తొలి జనాభా లెక్కల ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌తో దాదాపుగా 50 ఏళ్ల తర్వాత సీట్ల కేటాయింపును పునర్‌పరిశీలించే అవకాశం ఏర్పడనుంది.

### 543 నుంచి 824 సీట్లకు

ఎకనామిస్ట్స్ స్టడీ ప్రకారం, ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ నియోజకవర్గాల్ని పునర్విభజించడం ద్వారా వాటి సంఖ్య 824 కు పెరిగే అవకాశం ఉంది. ఇందుకోసం 59 నియోజకవర్గాల్ని రెండుగా విభజించడం, 111 నియోజకవర్గాల్ని మూడుగా విభజించే విధానాన్ని ప్రతిపాదించారు. ఇక్కడ హైదరాబాద్, సికింద్రాబాద్, కోల్‌కతా దక్షిణ్ వంటి మెట్రోపాలిటన్ నియోజకవర్గాలతో పాటు కొన్ని ద్వితీయ శ్రేణి పట్టణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు కూడా పునర్విభజనకు అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈ మార్పుల వల్ల జాతీయ స్థాయిలో ఓటింగ్ శాతం 0.3 నుంచి 2.3 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని పరిశోధకులు అంచనా వేశారు. దీనికి అనుగుణంగా సాధారణ ఎన్నికల్లో సుమారు 90 లక్షల నుంచి 2.3 కోట్ల మంది వరకు ఓటర్ల సంఖ్య పెరుగుతుందని నివేదిక చెబుతోంది. సాధారణంగా పెద్ద నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుందని భావిస్తుంటారు. కానీ తాజా అధ్యయనం ప్రకారం అసలు సమస్య నియోజకవర్గం పరిమాణం కాదంట. పట్టణీకరణ, ఎస్సీ- ఎస్టీ జనాభా శాతం, భాషా వైవిధ్యం వంటి అంశాలే ఓటింగ్ శాతాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తున్నట్లు తేలింది.

### పట్టణాల్లో మహిళా ఓటర్లే వెనుకంజ

ఇదే స్టడీలో మరొక ఆసక్తికర అంశం బయటికి వచ్చింది. పూర్తిగా పట్టణ ప్రాంతాల్లో నివసించే మహిళలు ఓటింగ్‌లో చాలా వెనుకబడి ఉన్నారని పరిశోధకులు గుర్తించారు. గ్రామీణ మహిళలతో పోల్చి చూస్తే పట్టణ ప్రాంతాల్లో మహిళల ఓటింగ్ శాతం సగటున 5 శాతం తక్కువగానే ఉంటున్నట్లు అంచనా వేశారు. ఇక్కడ ప్రధానంగా ఉద్యోగంలో ఒత్తిడి, ప్రయాణ భారాలు, కుటుంబ బాధ్యతలు వంటివి కారణాలుగా ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది.

### ఎన్నికల సంఘానికి కీలక సూచనలు


ఓటింగ్ శాతం పెంచేందుకు ఈ ఇరువురు ఆర్థికవేత్తలు ఎన్నికల సంఘానికి పలు కీలక సూచనలు చేశారు. మెట్రో నగరాల్లో మహిళల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేయడం సహా సాయంత్రం వేళల్లో పోలింగ్ సమయాన్ని పొడగించాలని ప్రతిపాదించారు. పోలింగ్ కేంద్రాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం, అంగన్‌వాడీలు, స్వయం సహాయక సంఘాలు, ఆశా వర్కర్ల ద్వారా మహిళా ఓటర్లలో అవగాహన పెంపొందించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.

# ఐక్యంగా పోరాడదాం

మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని బట్టి చూస్తే, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం ఖాయమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కానీ అసలు సమస్య ఏమిటంటే, విపక్ష కూటమి గెలవడానికి ఇక్కడ స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగవు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఇండియా కూటమి నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, విపక్ష నేతలు అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. "మనం కలిసికట్టుగా నిలబడి ప్రతిఘటిస్తే బీజేపీని ఓడించడం చాలా సులువు" అని పేర్కొన్నారు. వామపక్ష పార్టీలతో సహా ఇతర మిత్ర పక్షాలు కాంగ్రెస్?పై చేస్తున్న విమర్శలపై గాంధీ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఈ ప్రసంగం వీడియోను ఆయన తన ఎక్స్? ఖాతాలో పోస్టు చేశారు.

"నేను విషన్ని మింగిన నీలకంఠుడిని, నాపైగానీ, నా పార్టీపై గానీ వాళ్లు చేసే ఎలాంటి విమర్శలనైనా ముఖ్యంపై చిరునవ్వుతో స్వీకరిస్తాను. మిమ్మల్ని సంతోషపెట్టడానికి మేము ప్రయత్నిస్తాం. ఎందుకంటే మా పాత్ర మీ పాత్ర కంటే భిన్నమైనది. నేను దీనిని అహంకారంతో చెప్పడం లేదు. మీలా చాలా మంది పేర్కొన్నట్లుగా, మా పాత్ర అందరినీ ప్రేమ, ఆప్యాయతలతో ఒక్కటిగా చేర్చడం.

సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) లాంటి పార్టీలు తాము ఇప్పటి వరకు ఉపయోగించిన రాజకీయ వ్యూహాలు ఇంకా పనిచేస్తున్నాయని నమ్ముతున్నాయి. కానీ నేడు మన కూటమిలో ఒక విధమైన అయోమయం నెలకొంది. భారతదేశంలోని వ్యవస్థలు సరిగ్గా పనిచేయడానికి ఒక నిష్పక్షపాతమైన వాతావరణాన్ని కల్పించినప్పుడు మాత్రమే ఇవి పనిచేశాయి. కానీ ఇప్పుడు ఆ వాతావరణం లేదు. లీగల్ సిస్టమ్, బ్యూరోక్రసీ(అధికార యంత్రాంగం), నిఘా సంస్థలు, ఎలక్షన్ కమిషన్‌తో సహా దేశంలోని అన్ని ప్రభుత్వ సంస్థలను బీజేపీ తన నియంత్రణలో ఉంచుకుంది."



### టీఎంసీ ఊహాలోకంలో ఉంది!

ఈ సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ, బంగాల్?లో టీఎంసీ పార్టీ ఓటమికి గల కారణాలు చెప్పారు. "టీఎంసీలో నాకు చాలా మంది స్నేహితులు ఉన్నారు. ఎన్నికల్లో తాము క్లీన్ స్వీప్ చేస్తామని వారు బలంగా నమ్మారు. నేను వారితో చెబుతూనే ఉన్నాను. మీరు ఊహాలోకంలో ఉన్నారని. గుజరాత్?, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, మహారాష్ట్రల్లో ఏం జరిగిందో నేను కళ్లారా చూశాను. అయినప్పటికీ మీలో చాలా మంది ఇంకా నమ్మడం లేదు. మమతా బెనర్జీ తన ఎలక్షన్ చోరీ అయ్యిందని 100 శాతం కాకపోయినా, దాదాపు 90 శాతం వరకు నమ్ముతున్నారు. నా సోదరుడు తేజస్వి 40 శాతం మేర ఎలక్షన్ చోరీ జరిగిందని భావిస్తున్నారు. కానీ నేను చెబుతున్నాను వినండి. 100 శాతం ఎన్నికల చోరీ జరుగుతోంది. దయచేసి మీ మనస్సుల్లోని అనుమానాలను తొలగించుకోండి" అని రాహుల్ గాంధీ అన్నారు.

### విజయం ఇప్పటికే ఖరారైంది- కానీ!

సమీప భవిష్యత్తులో, ఇప్పటి వరకు పనిచేసిన వ్యవస్థలు ఆగిపోతాయని రాహుల్ వ్యాఖ్యానించారు. ఎందుకంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ భారతదేశంలోని అన్ని వ్యవస్థలపై తమ పట్టును బిగిస్తున్నాయని అన్నారు. "రాజకీయ పార్టీలు పనిచేయకపోతే, మరి ఏది పనిచేస్తుంది కచ్చితంగా ప్రతిఘటన పనిచేస్తుంది. నేను నా సొంత కళ్లతో చూశాను. నేను ఈ దేశవ్యాప్తంగా 4వేల కి.మీ నడిచాను. ప్రతిఘటన కచ్చితంగా పనిచేస్తుంది" అని రాహుల్ పేర్కొన్నారు.

"ఇకపై మనం ఒకరితో ఒకరు పోరాడుకోకూడదు. మీడియా మనపై దాడి చేయడానికి అవకాశం ఇవ్వకూడదు. తదుపరి ఎన్నికల్లో గెలవడమే పెద్ద సవాల్ అని మీరు అనుకుంటున్నారు. కానీ వచ్చే ఎన్నికల్లో విజయం ఇప్పటికే ఖాయం అయ్యింది. దయచేసి అర్థం చేసుకోండి. భారత ప్రజల్లో ఎంతో ఆగ్రహం ఉంది. వాళ్లు ఇప్పటికే తమ తీర్పును ఇండియా కూటమికి అనుకూలంగా ఇచ్చేశారు. కానీ సమస్యల్లా ఆర్?ఎస్?ఎస్? ద్వారా బీజేపీ సర్కార్? వ్యవస్థలను హస్తగతం చేసుకుంది. అందువల్ల గెలవడానికి మనకు స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు లభించవు. కాబట్టి మనం ప్రతిఘటించే మోడ్?లోకి వెళ్లాలి. సీబీఎస్ఈ, నీట్ విషయాల్లో ప్రభుత్వాన్ని ప్రతిఘటించాలి. గ్రేట్ నికోబార్‌కు వెళ్లి అక్కడ ప్రతిఘటించాలి. వాస్తవానికి ప్రతిఘటన అంటే భారత్ జోడో యాత్ర. మీరు ఉదయాన్నే లేచి నేను ఎలా ప్రతిఘటించగలను అని ప్రశ్నించుకుని, ఆ విధంగా ప్రతిఘటించాలి. అది కచ్చితంగా పనిచేస్తుంది. కనుక మన మధ్య సమన్వయం లేదని, కలసికట్టుగా పనిచేయడం లేదనే భావనను విడిచిపెట్టండి. మనం కలిసికట్టుగా ప్రతిఘటిస్తే బీజేపీని సులువుగా ఓడించగలం" అని కూటమిలోని మిత్రపక్షాలను ఉద్దేశించి రాహుల్ గాంధీ అన్నారు.

### విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే!

కాగా, నీట్, సీబీఎస్ఈ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఇండియా కూటమి సోమవారం డిమాండ్ చేసింది. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలపై సీజేఐకు లేఖ రాయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.

# బంకుల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం వల్ల ఇంధన సరఫరా కష్టమవుతుండడంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పారిశ్రామిక, వాణిజ్య, సంస్థాగత వినియోగదారులు పెట్రోల్ పంపుల నుంచి పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బదులుగా వారి అవసరాల కోసం ఇంధనాన్ని బల్క్ అమ్మకపు కేంద్రాల నుంచి పొందాలని సూచించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లోకి ఉంటుందని పేర్కొంది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ ఇంధనం నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యానికి ఆదేశాలిచ్చింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది.

### డీజిల్‌కు పెరిగిన డిమాండ్


ధరల వ్యత్యాసం కారణంగా బల్క్ వినియోగదారులు పెట్రోల్ పంపుల నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయడం ప్రారంభించడంతో కొన్ని ప్రాంతాలలో డీజిల్‌కు అసాధారణ డిమాండ్ పెరిగింది. దీంతో దేశ రాజధాని దిల్లీలోని పెట్రోల్ పంపుల వద్ద లీటరు డీజిల్ ధర రూ. 95.20 కాగా, బల్క్ సరఫరాదారుల వద్ద లీటర్ డీజిల్ ధర రూ. 134.50గా ఉంది. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై కేంద్రం ఈ ఆంక్షలు విధించింది.

### ప్రభుత్వ రంగ బంకుల్లో పెరిగిన సేల్స్

పశ్చిమాసియా సంక్షోభం తరువాత పెరిగిన ఇంధన ధరల నుంచి సాధారణ వినియోగదారులను కాపాడటానికి ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు రిటైల్ ధరలను సర్దుబాటు చేయడంతో ఈ వ్యత్యాసం ఏర్పడింది. టెలికాం టవర్లు, విద్యుత్ ఉత్పత్తి, ఇతర ఫీడ్‌స్టాక్ అవసరాల కోసం డీజిల్‌ను ఉపయోగించే పరిశ్రమలు వంటి బల్క్ వినియోగదారులకు మార్కెట్ ధర వసూలు చేస్తుండగా, రిటైల్ అవుట్‌లెట్ల వద్ద ధరలు ఉత్పత్తి వ్యయం కంటే చాలా తక్కువగా ఉన్నాయి. ధరలలోని ఈ వ్యత్యాసం వల్ల పెట్రోల్, డీజిల్‌ను అధిక రేట్లుకు విక్రయించే ప్రైవేట్ రంగ అవుట్‌లెట్లలో అమ్మకాలు తగ్గిపోయాయి. ప్రభుత్వ రంగ సంస్థల పెట్రోల్ పంపుల్లో అమ్మకాలు పెరిగాయి.

కాగా మే నెలలో మూడు ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లో పెట్రోల్ అమ్మకాలు 4.8 శాతం, డీజిల్ అమ్మకాలు 6.4 శాతం మేర పెరిగాయి. ఈ క్రమంలో రిటైల్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. పరిశ్రమలు, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని వెల్లడించింది. అంతేగాకుండా పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశాలిచ్చింది. ఈ డీజిల్‌ను పునర్‌విక్రయించకూడదని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని చెప్పింది. అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని ప్రకటించింది. ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలను ప్రభావితం చేస్తున్న ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితి కారణంగా ఈ చర్య అవసరమైం దని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ పరిస్థితి అంతర్జాతీయ పెట్రోలియం సరఫరా గొలుసులు, షిప్పింగ్ లాజిస్టిక్స్, పెట్రోలియం ఉత్పత్తుల లభ్యతపై ప్రతికూల ప్రభావం చూపిందని స్పష్టం చేసింది. ఇంధన నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అనధికారిక సేకరణ, మళ్లింపు వంటి విషయానికి సంబంధించిన ఈ ఉత్తర్వును అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది.

## మళ్లీ మొదలైన ఎల్ నినో




పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న ప్రాంతంలో ప్రస్తుతం ఎల్ నినో పరిస్థితులు ఉన్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం తెలిపింది. రానున్న వర్షాకాలం(నైరుతి రుతుపవనాల కాలం)లో ఇది మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఐఎండీ తన జూన్ 2026 ఎన్సో (ఈఎన్ఎస్ఓ), ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) బులెటిన్‌లో ఈ వివరాలు వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్ర మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగాయని, ఇవి ఎల్ నినో ఏర్పడడానికి కావాల్సిన స్థాయిని దాటిపోయాయని పేర్కొంది. దీనికనుగుణంగానే వాతావరణంలో కూడా మార్పులు వచ్చాయని తెలిపింది. సముద్రం, గాలి కలిసి పనిచేసే తీరును బట్టి చూస్తే, ప్రస్తుతం భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్ నినో లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది. 'మాన్‌సూన్ మిషన్ కపుల్డ్ ఫోర్?కాస్ట్ సిస్టమ్' అంచనాల ప్రకారం, ఈ వర్షాకంలో ఎల్ నినో పరిస్థితులు ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపింది. వాస్తవానికి 2026 జూన్?లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఈ పరిమితిని దాటేశాయని ఐఎంపీ తన బులెటిన్?లో పేర్కొంది. ఈ వాతావరణ మార్పును కొలిచే 'నినో 3.4 ఇండెక్స్' మూడు నెలల సగటు ఉష్ణోగ్రత ౦0.5సీ కంటే పైకి రికార్డ్ అయ్యిందని తెలిపింది. ఇది ఎల్ నినో ప్రారంభమైంది అనడానికి సంకేతమని స్పష్టం చేసింది. అంతేకాదు సముద్ర పైభాగంలోనే కాకుండా, లోపలి పొరల్లోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, రానున్న నెలల్లో ఈ వేడి నీరు పైకి వచ్చి ఎల్ నినోను మరింత బలోపేతం చేస్తుందని ఐఎండీ గుర్తించింది.

### భారత్‌పై ఈ ఎల్ నినో ప్రభావం ఎంత?

ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో వేడి పెరడం వల్ల వచ్చే ఒక సహజమైన వాతావరణ మార్పు. భారతదేశానికి సంబంధించి చూసుకుంటే, 2000వ సంవత్సరం తర్వాత అంటే 2002, 2009, 2015, 2023లో ఎల్ నినో తరహా వాతావరణ మార్పులు వచ్చాయి. సాధారణంగా ఈ ఎల్ నినో సమయంలో దేశంలో రుతుపవనాలు బలహీనపడడం, తక్కువ వర్షాలు కురవడం, ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం, వర్షాలు లేకుండా పొడి వాతావరణం ఏర్పడడం లాంటివి జరుగుతుంటాయి. మరీ ముఖ్యంగా కొన్ని సంవత్సరాలపాటు కరవు వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది. అయితే భారతదేశ వర్షపాతాన్ని కేవలం ఎల్ నినో ఒక్కటే ప్రభావితం చేయదని ఐఎండీ స్పష్టం చేసింది. ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో 'ఇండియన్ ఓషన్ డైపోల్' (ఐఓడీ) సాధారణ స్థితిలోనే ఉందని తెలిపింది. అందువల్ల ఎల్? నినో ప్రభావాన్ని తగ్గించడంలో, పెంచడంలో దీని పాత్ర చాలా పరిమితం అని పేర్కొంది. పసిఫిక్ మహాసముద్రంలో మారుతున్న పరిస్థితులను తాము నిరంతరం గమనిస్తూ, ప్రతి నెలా తాజా సమాచారాన్ని అందిస్తామని ఐఎండీ పేర్కొంది.

### ఎల్ నినో ఏర్పడినప్పుడు ఏం జరుగుతుంది?

సాధారణంగా తీవ్రమైన ఎల్ నినో ఏర్పడినప్పుడు, ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో భిన్నమైన పరిస్థితులు తలెత్తుతాయి. దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియాలోని చాలా ప్రాంతాల్లో తీవ్రమైన కరువు, కార్చిచ్చులు వస్తాయి. అదే సమయంలో అమెరికాలోని దక్షిణ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి వరదలు ముంచెత్తుతాయి. ముఖ్యంగా భారత్ విషయానికొస్తే, ఎల్ నినో కారణంగా రుతుపవనాలు తీవ్రంగా బలహీనపడతాయి. దీనివల్ల వర్షపాతం తగ్గిపోతుంది. ఈ పరిణామాల వల్ల ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగం కుదేలై పంట దిగుబడులు తగ్గిపోతాయి. ఆహార ధరలు ఆకాశాన్ని తాకుతాయి. సప్లై చైన్ దెబ్బతిని, ఆర్థిక వ్యవస్థలకు లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని నిపుణులు చెబుతున్నారు. మనిషి సృష్టిస్తున్న వాతావరణ మార్పులకు, ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడే ఈ ఎల్ నినో కలిస్తే ఎలాంటి విపత్తులు వస్తాయోనని శాస్త్రవేత్తలు భయపడుతున్నారు. ఈ ఎల్ నినో దెబ్బకి వచ్చే 2027 సంవత్సరం చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించే అవకాశం ఉంది.

## నీట్ రీ ఎగ్జామ్‌లో మార్పులు



వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న నీట్ రీ ఎగ్జామ్ 2026లో జాతీయ పరీక్షల సంస్థ- చీూూ కొన్ని మార్పులు చేసింది. ఈ నెల 21న దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష జరగనుండగా విద్యార్థుల సౌకర్యార్థం సమయాన్ని మరో 15 నిమిషాలు పొడిగించింది. ఈ నెల 21 మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల 15 నిమిషాల వరకూ పరీక్ష జరుగుతుందని చీూూ ప్రకటించింది. మొత్తంగా ఈ పరీక్ష 195 నిమిషాల పాటు జరగనుంది. పరీక్ష ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత ఇన్విజిలేషన్ ప్రక్రియకు పెంచిన సమయం ఉపయోగపడుతుందని తెలిపింది. అభ్యర్థుల నుంచి గత కొన్నేళ్లుగా వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ మార్పులు చేశామని చీూూ తెలిపింది. రఫ్ వర్క్ కోసం ఇచ్చే పేజీలను రెట్టింపు చేసినట్లు వెల్లడించింది. ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్ వర్క్ కోసం ఇప్పటివరకూ రెండు పేజీలు ఇస్తుండగా ఈసారి 4 పేజీలు ఇవ్వనున్నట్లు చీూూ పేర్కొంది. ఎడమచేతి వాటం ఉన్న విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రశ్నపత్రం మొదట్లో, చివరిలో రెండేసి రఫ్ పేపర్లను ఏర్పాటు చేసినట్లు వివరించింది. గతంలో, రఫ్ వర్క్ పేజీలు కేవలం ప్రశ్నపత్రం బుక్‌లెట్ చివరలో మాత్రమే ఉండేవి. సవరించిన విధానం ప్రకారం, సూచనల పేజీ తర్వాత వెంటనే రెండు రఫ్ వర్క్ పేజీలు ఉంటాయి, అలాగే మరో రెండు అదనపు పేజీలు బుక్‌లెట్ చివరలో ఉంటాయి. ఈ కొత్త విధానం ప్రశ్నపత్రం ఇంగ్లీష్, ప్రాంతీయ భాషా వెర్షన్లు రెండింటిలోనూ ప్రవేశపెట్టారు.

"పరీక్ష ప్రారంభం, ముగింపులో ఉండే ఇన్విజిలేషన్ ప్రక్రియ (ఉదాహరణకు సంతకాలు చేయడం వంటివి) తమ అసలు పని సమయాన్ని తగ్గిస్తున్నాయని అభ్యర్థులు గతంలో భావించేవారు. ఆ సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకునేలా సమయ వ్యవధిని రూపొందించాం. ఈ ప్రక్రియలతో సహా మొత్తం సమయాన్ని 195 నిమిషాలుగా నిర్ణయించాం. అభ్యర్థులు లెక్కలు, విశ్లేషణలు చేసుకోవడానికి వీలుగా ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్-వర్క్ కోసం కేటాయించిన పేజీల సంఖ్యను రెండు పేజీల నుంచి నాలుగు పేజీలకు పెంచాం. ఇప్పుడు బుక్‌లెట్‌లో ముందు, వెనుక భాగాల్లో రఫ్-వర్క్ పేజీలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల ప్రతి అభ్యర్థి సౌకర్యవంతంగా పరీక్ష రాయవచ్చు. ముఖ్యంగా మొత్తం అభ్యర్థుల్లో దాదాపు 10శాతం మంది ఉండే ఎడమ చేతి వాటం అభ్యర్థులకు ఇది ఎంతో సహాయపడుతుంది." "పరీక్షా విధానంలో చేసే చిన్న, ఆలోచనాత్మకమైన మార్పులు కూడా అత్యంత కీలకమైన పరీక్షా సమయంలో అభ్యర్థి సౌకర్యంలో గణనీయమైన మార్పును తీసుకురాగలవు. చీఱుఱు (ఖ+) 2026 పరీక్షను పారదర్శకంగా, సురక్షితంగా అభ్యర్థులకు అనుకూలమైన రీతిలో నిర్వహించడానికి, అలాగే ఈ పరీక్షకు హాజరయ్యే లక్షలాది మంది ఆశావహుల కోసం పరీక్షా విధానాన్ని నిరంతరం మెరుగుపరచడానికి తమకున్న నిబద్ధతను చీూూ పునరుద్ఘాటించింది." అని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రతి సంవత్సరం పరీక్షకు హాజరయ్యే లక్షలాది మంది ఆశావహుల కోసం పరీక్షా అనుభవాన్ని మెరుగుపరచడం కొనసాగిస్తామని ఏజెన్సీ చెప్పింది. వాస్తవానికి మే 3న నీట్ జరగ్గా పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం తీవ్ర దుమారం సృష్టించింది. దీంతో ఎన్‌టీఏ పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా దానిని రద్దుచేసి, జూన్ 21న మళ్లీ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రధాన్? రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్? చేశాయి. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేసు నమోదు చేసిన సీబీఐ ప్రస్తుతం దర్యాప్తు కొనసాగిస్తోంది.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily
శనివారం, 13 జూన్ 2026

# గ్రామాల నుంచే నాయకత్వం రావాలి

-మొదటిపేజీ తరువాయి

రాజ్యాంగం, చట్టాలను క్షుణ్ణంగా చదివానని పవన్ తెలిపారు. ఆ తర్వాత గ్రామాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయో గమనించారు. అప్పుడు ఎన్నో కఠోర వాస్తవాలు తెలిశాయన్నారు. "గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి కూడా డబ్బుల్లేవని మొదటి సమస్య విన్నాను. గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు ఎప్పుడో ఆగిపోయాయని తెలిసింది. నిధులు లేకపోవడంతో గ్రామస్థాయి పరిపాలన తీవ్రంగా బలహీనపడిందని అధికారులు వాపోయారు. నిధుల కొరతతో పాటు, ఎవరి బాధ్యతలు ఏమిటనే దానిపై కూడా కనీస స్పష్టత లేకపోయింది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామస్థాయి వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అత్యంత నిబద్ధతతో పని చేస్తోందని పవన్ స్పష్టం చేశారు. గ్రామ సమస్యలకు పరిష్కారం ఆ గ్రామంలోనే జరగాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామస్థాయిలో పూర్తికావాల్సిన పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ మండల స్థాయికి వెళ్లకూడదని స్పష్టం చేశారు. "గ్రామాల నుంచి బలమైన నాయకత్వం రావాలి. అప్పుడే మార్పు మొదలవుతుంది. రైతు ఆశలు, మహిళల ఆత్మవిశ్వాసం, యువత ఉపాధి, ఇవన్నీ గ్రామ పంచాయతీ ద్వారానే ప్రారంభం కావాలి. పంచాయతీరాజ్ సంస్కరణల కోసం గతంలో ఎన్నో కమిటీలు వచ్చాయని పవన్ గుర్తు చేశారు.



"కూటమిలో భాగంగా జనసేన కేవలం 21 సీట్లతో సర్దిపెట్టుకున్న సందర్భంలో చాలామంది విమర్శించారు. కానీ, ప్రజల ఆశీర్వాదంతో మేము వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించాం. పోటీ చేసిన ప్రతి చోటా గెలిచాం. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఇప్పుడు అమలు చేస్తున్నాం. రెండేళ్ల క్రితం ప్రజలు మాకు కేవలం అధికారం ఇవ్వలేదు, బాధ్యత అప్పగించారు".

**ప్రజలు కేవలం ఓటేయరు, చరిత్ర రాస్తారు**

ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలే అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. "ప్రజలు కేవలం ఓటు మాత్రమే వేయరు. వాళ్లు చరిత్రను కూడా రాస్తారు. ప్రజలు మౌనంగా కనిపించినా సరే, సమయం వచ్చినప్పుడు ఆ చరిత్రను మార్చగలరని నిరూపించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్రానికి మళ్లీ కొత్త ఆశలు వచ్చాయి. ఆ తీర్పు రానున్న ఒక తరం భవిష్యత్తుకు గొప్ప నమ్మకం కలిగించింది. ఈ చారిత్రక విజయానికి కారణమైన ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు" అని పవన్ తెలిపారు.

**'స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాం'**

జాతీయ రాజకీయాలు, రాష్ట్ర ప్రయోజనాలపైనా పవన్ కల్యాణ్ మాట్లాడారు. ఎన్నికైన ప్రధానిగా నిరంతరాయంగా సుదీర్ఘకాలం కొనసాగుతున్న నరేంద్ర మోదీకి ఆయన అభినందనలు తెలిపారు. "ఎన్డీయే పక్షాల సమష్టి కృషితో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆపగలిగాం. అయితే, దురదృష్టవశాత్తు స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం జరిగి 8 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం" అన్నారు. ఆ దుర్ఘటన జరిగినందు వల్లే, 9వ తేదీన జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసి ఇవాళ జరుపుకుంటున్నామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# పోరాటం ఆగదు.. మోసాలను నిలదీస్తాం

తాడేపల్లి: "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమం సక్సెస్‌పై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజల తరపున పోరాటం ఆగదు.. మోసాలను నిలదీస్తాం అంటూ ఆయన ట్వీట్ చేశారు. 2YearsForCBNBackStabbing హ్యాష్ ట్యాగ్‌తో ఎక్స్‌లో వైఎస్ జగన్ పోస్ట్ చేశారు. రెండేళ్ల 'నారాసుర' పాలన-రాష్ట్రానికి, ప్రజలకు వెన్నుపోటు.. ర్యాలీలు ప్రజాగ్రహానికి అద్దం పట్టాయని ఆయన ట్వీట్? చేశారు. "రెండేళ్ల క్రితం చంద్రబాబు ప్రజల ముందుకు వచ్చి ఎన్నో హామీలు ఇచ్చారు. సూపర్ సిక్స్ అన్నారు.. సూపర్ సెవెన్ అన్నారు.. మొత్తం 143 హామీలు తన మేనిఫెస్టోలోను బాండ్ల రూపేనా, ప్రతి ఇంటికీ వెళ్లి ఈ బాండ్లు రాసి మరి ఇచ్చారు! కానీ ఈరోజు రాష్ట్ర ప్రజలు ఒకటే ప్రశ్న అడుగుతున్నారు... ఆ హామీలు ఏమయ్యాయి చంద్రబాబూ" అంటూ వైఎస్ జగన్ నిలదీశారు. "రైతులను మోసం చేశారు, మహిళలను మోసం చేశారు, యువతను మోసం చేశారు, విద్యార్థిని మోసం చేశారు. చివరకు ప్రతి కుటుంబాన్ని మోసం చేశారు. ఎన్నికల సమయంలో చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన పనులకు ఏమాత్రం పొంతనే లేదు. ప్రతి క్షణం మోసం, దగాయే, స్కాంల మయమే!' అని వైఎస్ జగన్ దుయ్యబట్టారు.

"ఈ రెండేళ్లలో రాష్ట్రం చూసింది అభివృద్ధి కాదు... పచ్చి అబద్ధాల ప్రచారం. సంక్షేమం కాదు... రాష్ట్ర ప్రజలు చూసింది మోసం! ప్రజాపాలన కాదు... రాజకీయ కక్షసాధింపులు, వివక్ష, అరాచకాలు, రెడ్‌బుక్ రాజ్యాంగంతో భయానక పాలన. వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి. మహిళలకు, చిన్నారులకు రక్షణ అనేదే లేదు. పోలీసు సహా అన్ని వ్యవస్థలనూ భ్రష్టు పట్టించారు. శాంతిభద్రతలను దారుణంగా దెబ్బతీశారు. జంగిల్‌రాజ్‌లా రాష్ట్రాన్ని నడుపుతున్నారు.



సొంత ప్రజలపై కక్షగట్టిన నాయకుడ్ని ఏమంటాం?" అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

"అమరావతి నిర్మాణం పేరుతో అంతులేని అవినీతి. ఇసుక,మట్టి, లిక్కర్, క్వార్ట్జ్, లేటరైట్ అన్నీ మాఫియాలు నడుపుతున్నారు. రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. మరోవైపు ప్రజలపై భారం మాత్రం రోజు రోజుకూ పెరుగుతోంది. కరెంటు ఛార్జీలు పెరిగాయి, పెట్రోల్, డీజిల్ వ్యాట్‌లు పెరిగాయి, బస్సు ఛార్జీలు పెరిగాయి, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి, పన్నులు పెరిగాయి! కానీ ప్రజల ఆదాయం పెరగలేదు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులతో సతమతమవుతోంది. దీనివల్ల ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి. పేదరికం బుసలు కొడుతోంది. ..విద్యా రంగం దెబ్బతింది. వైద్య రంగం దెబ్బతింది. వ్యవసాయం సంక్షోభంలో ఉంది. ఏ పంటకూ గిట్టుబాటు ధరలేదు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఆశలు చూపించారు. కానీ డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు, అవకతవకలు, స్కామ్‌లతో యువత భవిష్యత్తును దారుణంగా దెబ్బతీశారు. ఉద్యోగాలు ఇవ్వలేకపోయారు, ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయారు, సూపర్-6, సూపర్-7లో చెప్పిన హామీలు మోసాలుగా మార్చారు! ప్రచార కార్యక్రమాలకు మాత్రం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ..ఈ రోజు రాష్ట్రంలో ఏ వర్గాన్ని అడిగినా అసంతృప్తే కనిపిస్తోంది. ఏ కుటుంబాన్ని కలిసినా మోసపోయామనే బాధ వినిపిస్తోంది. ప్రతి ఇంట్లో చంద్రబాబు ప్రభుత్వ మోసాలు, వైఫల్యాల గురించే చర్చ జరుగుతోంది. అందుకే ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీలు ప్రజల ఆవేదనకు, ఈ ప్రభుత్వం పట్ల వ్యతిరేకతకు అద్దంపట్టాయి. ప్రజల ఆగ్రహానికి ప్రతీకగా నిలిచాయి. ఈ పోరాటంలో ప్రజలకు తోడుగా పాల్గొన్న ప్రతి నాయకుడికి, ప్రతి కార్యకర్తకు, యువతకు, ప్రజలకు నా హృదయపూర్వక అభినందనలు. ..చంద్రబాబుకి ఒక్కటే చెప్పాలనుకుంటున్నాను. అబద్ధాలతో కొంతకాలం ప్రజలను మోసం చేయవచ్చు. కానీ ఎప్పటికీ మోసం చేయలేరు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ప్రతి హామీని గుర్తుంచుకున్నారు. ప్రతి మోసాన్ని లెక్కపెడుతున్నారు. ఈ 'నారాసుర పాలన'కు వ్యతిరేకంగా ప్రజల తరపున మా పోరాటం ఆగదు. మోసాలను నిలదీస్తాం. స్కామ్‌లను, మీ అన్యాయాలను ప్రశ్నిస్తాం! ప్రజల గొంతుకగా నిలబడతాం. అన్నివర్గాల అండతో, ప్రజాబలంతో, దేవుడి దయతో ఈ దుర్మార్గపు ప్రభుత్వం గద్దెదిగక తప్పదు" అంటూ వైఎస్ జగన్ పేర్కొన్నారు.

# ప్రమాదంలోనూ... రాజకీయమా



విశాఖపట్టణం : స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లిలాంటిదే అన్నట్టుగా వైసీపీ నాయకులకు ఎక్కడ ఎలా వ్యవహరించాలో తెలియడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం జరిగి 8 మంది మృతి చెందిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా అందరినీ కలిచి వేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన మంత్రి నారా లోకేష్.. వారిలో భరోసా నింపే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.కానీ.. దీనిని కూడా వైసీపీ నాయకులు రాజకీయాలకు వాడేసుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. వాస్తవానికి ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అందరూ కలివిడిగా వ్యవహరించి.. బాధితులకు అండగా.. వారికి భరోసా కల్పించేలా వ్యవహరించాలి. కానీ, దీనికి భిన్నంగా వైసీపీ నాయకులు నారా లోకేష్ పర్యటనపై విమర్శలు చేశారు. బాధిత కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ప్రకటించాలన్న కార్మిక సంఘాలను నారా లోకేష్ ఏదో అన్నారని.. లోకేష్ నియంతలా వ్యవహరిస్తున్నారని వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యానించారు.వాస్తవానికి కార్మికుల పక్షాన, ఉద్యోగుల పక్షాన, మరీ ముఖ్యంగా బాధితుల పక్షాన నిలబడడాన్ని ఎవరూ తప్పు బట్టరు. ప్రభుత్వాన్ని ప్రశ్నించవద్దని కూడా ఎవరూ అనరు. అంతేకాదు.. బాధితులకు సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో పరిహారం ఇప్పించే ప్రయత్నం చేయడాన్ని కూడా ఎవరూ తప్పుగా చూడరు. వైసీపీ స్థానంలో టీడీపీ ఉన్నా.. బాధితుల పక్షానే నిలబడుతుంది. కానీ.. దీనికి కూడా సమయం, సందర్భం అంటూ ఒకటి ఉంటుంది. విశాఖ ప్లాంట్ ఘటనలో తప్పు ప్రభుత్వానిదా? అంటే కాదు.ఇది ప్రమాదవశాత్తు జరిగిందని సాక్షాత్తూ కేంద్ర మంత్రే చెప్పారు. పోనీ.. ఈఘటన.. ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనల కారణంగా జరిగిందా? అంటే.. దీనికి రాష్ట్ర సర్కారుకు సంబంధం లేదు. అయినప్పటికీ.. ఈ ఘటనను ప్రభుత్వానికి, ముఖ్యంగా మంత్రి లోకేష్‌కు ముడిపెట్టి.. గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలు చేయడం.. బాధితులను పరామర్శించడాన్ని కూడా తప్పుపట్టేలా మాట్లాడడం వంటివి సరికాదని అంటున్నారుఏదైనా ఉంటే.. సమయం చూసుకుని ప్రభుత్వానికి సూచనలు చేయొచ్చని.. ప్రతిపక్ష(ప్రధానకాదు) పార్టీగా వైసీపీ తరపున కూడా బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నించవచ్చని చెబుతున్నారు. కానీ, ఈ బాధ్యతలను మరిచిన గుడివాడ.. మీడియా సమావేశాలు పెట్టి మంత్రిని విమర్శించడమే పనిగా పెట్టుకోవడంపై విశాఖ వాసులే.. నవ్విపోతున్నారు

**టీడీపీ, జనసేన**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు.. కూటమి ప్రభుత్వంలో కీలక రోల్ పోషిస్తున్న విషయం తెలిసిందే. జనసేన పార్టీ అధినేతగా పవన్ కల్యాణ్, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ వ్యవహరిస్తున్నారు. తాజాగా తొలిసారి ఒకే సమయంలో ఇద్దరు నేతలుకూడా విశాఖలో పర్యటించారు. సోమవారం సాయంత్రం విశాఖలోని స్టీల్‌ప్లాంట్ జరిగిన ఘోర ప్రమాదంలో 8 మంది మృతి చెందడం తో పాటుపలువురు గాయపడ్డారు. వీరిని పరామర్శించేందుకు ఇరువురు నాయకులు విశాఖలో పర్యటించారు.రష్యా పర్యటనకు వెళ్లిన.. మంత్రి నారా లోకేష్.. ఈ రోజు ఉదయమే.. హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో ఆయన విదేశీ పర్యటన బడలికతో మంగళవారం రెస్ట్ తీసుకోవాలని, కుటుంబ సభ్యులతో గడపాలని అనుకున్నారు. కానీ, విశాఖలో జరిగిన దుర్ఘటనతో ఆయన ఉదయం 10 గంటలకే హైదరాబాద్ నుంచి నేరుగా విశాఖకు చేరుకున్నారు. ఇక, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. కూడా మంగళగిరి నుంచి నేరుగా విశాఖకు చేరుకుని.. బాధితులను పరామర్శించారు.విశాఖ స్టీల్ ప్లాంట్ బాధితుల పరామర్శకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు వచ్చినా.. ఇద్దరూ ఎలాంటి గందరగోళానికి తావివ్వకుండా.. పనిని పంచుకున్నట్టు స్పష్టమైంది. మంత్రి లోకేష్.. నేరుగా ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లారు. వారితో మాట్లాడి.. ఓదార్చారు. వారితో కలిసి కూర్చుని వారి బాధను పంచుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం నూరిపోశారు.ఇక, పవన్ కల్యాణ్.. మంగళగిరి నుంచి నేరుగా విశాఖకు చేరుకున్నా.. అక్కడి నుంచి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లారు. వారిని పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యాన్ని, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి నుంచి కొంత సమాచారం తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు.ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా.. ఇరువురు నేతలు.. వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. నిజానికి ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు నాన్ ప్లాన్‌గా వ్యవహరించే పరిస్థితి ఉంటుంది. కానీ, పవన్, లోకేష్‌లు బాధితుల పరామర్శలో భాగం అయ్యే విషయంలో జాగ్రత్తలు తీసుకుని విమర్శలకు తావులేకుండా వ్యవహరించారు.

## అన్నీ తాకట్టు పెట్టేవాళ్లకు మాట్లాడే అర్హత లేదు

-మొదటిపేజీ తరువాయి

సమీపంలోని దామినేడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్?కల్యాణ్?, మంత్రి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి నేతలు పాల్గొన్నారు. అలాగే కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా, రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే, గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం.

2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారు" అని చంద్రబాబు విమర్శించారు.

**వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్**

ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు, రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదని చంద్రబాబు అన్నారు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చామని గుర్తుచేశారు. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి, శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతామన్నారు. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం, ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే ఉంటాయన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నామని తెలిపారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామన్నారు. "పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, ఢిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు. 12 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధివైపు దూసుకెళ్లింది".
–చంద్రబాబు, సీఎం

## రాష్ట్రవ్యాప్తంగా మోగిన బడి గంట

-మొదటిపేజీ తరువాయి

వాయిస్తూ విద్యార్థులతో కలిసి టీచర్లు నృత్యం చేశారు.

**మంగళవాద్యాలతో పాఠశాలకు**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా, తొలిరోజు బడులకు పిల్లలు హుషారుగా హాజరయ్యారు. పాఠశాలల వద్ద ముగ్గులు వేసి తోరణాలు కట్టి మరీ విద్యార్థులకు స్వాగతం పలికారు. జిల్లాలో 1551 సర్కారు బడులు ఉండగా, సుమారు 40 శాతం మంది పిల్లలు తొలిరోజు బడులకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలు విద్యార్థులకు ఇచ్చేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఆత్రేయపురం మండలంలో ప్రధాన ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా 'మన బడి - మన పండుగ' కార్యక్రమాన్ని వినూత్న రీతిలో నిర్వహించారు. ఉదయమే చిన్నారుల ఇంటికి వెళ్లిన శ్యామ్ ప్రత్యేకంగా తయారు చేసిన 'మన బడి- మన పండుగ' కిరీటాన్ని వారికి ధరింపజేశారు. తర్వాత మంగళవాద్యాల మధ్య విద్యార్థులను పాఠశాలకు తీసుకొచ్చారు.

**మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు**

పార్వతీపురం మన్యం జిల్లాలో వేసవి సెలవుల తర్వాత విద్యార్థులు బడిబాట పట్టారు. మామిడి తోరణాలు కట్టి ఉత్సాహకరమైన వాతావరణంలో ఉపాధ్యాయులు బడిలోకి పిల్లలను ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ రావు సందర్శించారు. పాఠశాలలో కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులను అభినందించారు. వారికి చాక్లెట్లు అందించి ఉత్సాహపరిచారు. వేసవి సెలవుల ముగిసి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. సమగ్ర విద్యా వికాస కేంద్రాలైన ప్రభుత్వ విద్యాలయాలు పిల్లలకు సాదర స్వాగతం పలుకుతున్నాయన్నారు.

**కొత్త విద్యా సంవత్సరంపై ఆశావహంగా**

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 వేల ప్రభుత్వ పాఠశాలలు, 44 వేల ప్రైవేటు పాఠశాలలు నేడు తిరిగి ప్రారంభమయ్యాయి. మొదటి రోజునే విద్యార్థులకు ఆహ్వానం పలికేందుకు పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు కొత్త విద్యా సంవత్సరంపై ఆశావహంగా ఉన్నారు.

**రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా**

రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను వంద శాతం పాఠశాలలకు ప్రభుత్వం చేరవేసింది. దీంతో మొదటి రోజునుంచే విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి మొత్తం అందుబాటులోకి వచ్చింది. పుస్తకాల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## కర్నూలులోనూ కుప్పం ఫార్ములా...

కర్నూలు : 2024 ఎన్నికల వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ బాగా బలహీనంగా ఉండేది. అది ఎంతలా అంటే? 2019లో అసెంబ్లీకి, లోక్‌సభకు జిల్లా నుంచి అస్సలు ప్రాతినిధ్యమే లేనంత. ఇక జెడ్పీ, మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి. ఇక్కడ ఇంకో విచిత్రం ఏంటంటే? పార్టీ క్యాడర్ బలంగా వున్నా, కేవలం నాయకుల మధ్య విభేధాలు, వాళ్ళ మీదున్న వ్యతిరేకత లాంటి కారణాలతోనే టీడీపీ వెనుకబడింది. సుమారు రెండు దశాబ్దాల పాటు ఉమ్మడి జిల్లాలో టీడీపీ బలహీనంగానే కనిపించింది. కానీ? 2024 ఎన్నికలకు వచ్చేసరికి అనూహ్యంగా పుంజుకుంది తెలుగుదేశం. జిల్లాలోని మొత్తం 14 అసెంబ్లీ, రెండు లోక్‌సభ నియోజకవర్గాలకుగాను కూటమి12 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లలో గెలిచింది. అందులో టీడీపీ వాటానే 11 అసెంబ్లీ , 2 ఎంపీ సీట్లు. దీంతో? ఇక పూర్వ వైభవం వచ్చినట్టేనని సంబరపడ్డారు ఇక్కడి తమ్ముళ్లు. కానీ ఇప్పుడు ఒక్కసారి రెండేళ్ళ వెనక్కి తిరిగి చూసుకుంటే? మొత్తం తేడాతేడాగానే కనిపిస్తోందట. పరిస్థితి మళ్లీ అధ్వాన్నంగానే మారుతోందన్నఅభిప్రాయం టీడీపీ వర్గాల్లోనే బలపడుతోంది. అందుకు కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం ఒక కారణం అయితే టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో నేతల తీరు మరో కారణం అంటున్నారు. శాసనసభ్యుల తీరు పార్టీకి తీరని నష్టం కలిగించేలా ఉందన్న వాదన బలపడుతోంది.కొందరు ఎమ్మెల్యేలు నిత్యం వివాదాల్లో చిక్కుకోవడం, నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, భూ కబ్జా ఆరోపణలు, అక్రమ రిజిస్ట్రేషన్లతో భూములు సొంతం, దౌర్జన్యాలు, అనుచరుల ఆగడాలు వెరసి కూటమి ప్రభుత్వానికి మరకలు అంటుకునేలా చేస్తున్నాయన్నది కేడర్ వాయిస్. వీటన్నిటికీ మించి ఎమ్మెల్యేలు, ఇతర నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం లేకపోవడం, కొన్ని నియోజకవర్గాల్లో సీనియర్ నేతలు పార్టీని వీడిపోవడం, దూరంగా ఉండడం లాంటివి నష్టం కలిగిస్తున్నట్టు చెబుతున్నారు. ఆలూరు, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, డోన్, నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం నియోజకవర్గాల్లో సమస్యలు అధికంగా ఉన్నాయట. దీంతో.. ఇప్పుడు ఆయా నియోజకవర్గాల్లో కూడా కుప్పం ఫార్ములాను అప్లయ్ చేస్తారా అంటూ తాజా చర్చలు జరుగుతున్నాయి. తన సొంత నియోజకవర్గం కుప్పంలో పార్టీ నేతలు గాడి తప్పుతున్నారని గుర్తించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నియోజకవర్గ వ్యవహారాలను చూస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను ఉన్నఫళంగా బాధ్యతల నుంచి తప్పించడం హాట్ టాపిక్ అయింది. దాంతో.. గాడి తప్పుతున్న కర్నూలు వ్యవహారాలను కూడా అదే స్పీడ్‌తో, అంతే స్ఫూర్తితో సెట్ చేస్తారా అంటూ మాట్లాడుకుంటున్నాయి పార్టీ వర్గాలు. పార్టీని చక్కదిద్దేందుకు చంద్రబాబు తన నియోజకవర్గం నుంచే ఆపరేషన్ ప్రారంభించారని, జిల్లాలోనూ ఆ ఫార్ములాను అమలు చేస్తే బాగుంటుందని కొందరు అంటుంటే? అలా చేస్తారా అంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెట్టేవాళ్ళు మరికొందరు.ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను. 8 నుంచి 10 చోట్ల అంతర్గత సమస్యలతో సతమతం అవుతోంది టీడీపీ.

కడప మనస్సాక్షి
తెలుగు దినపత్రిక
KADAPA MANASSAKSHI - Telugu Daily
PRGI Reg.No: APTEL/26/A0309



## జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని మర్యాదపూర్వకంగా కలిసిన అసిస్టెంట్ కలెక్టర్లు



కడప (కడప మనస్సాక్షి): క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాకు వచ్చిన ఎనిమిది మంది అసిస్టెంట్ కలెక్టర్ల బృందం శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని ఆయన బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులు అసిస్టెంట్ కలెక్టర్లకు మధ్యాహ్న విందుతో చక్కటి ఆతిథ్యం ఇచ్చి, చిరు కానుకలతో సత్కరించారు. శిక్షణలో భాగంగా పరిపాలన సంబంధిత అంశాలపై వారు కలెక్టర్ నుండి పలు సూచనలు, సలహాలను స్వీకరించారు. అంతకుముందు ఈ బృందం జిల్లాలోని సుప్రసిద్ధ పర్యాటక కేంద్రం గండికోటను సందర్శించింది. అనంతరం రాష్ట్రానికే స్ఫూర్తిగా నిలిచిన, జిల్లా కలెక్టర్ వినూత్న ఆవిష్కరణ అయిన 'స్మార్ట్ కిచెన్' వ్యవస్థను పరిశీలించేందుకు ఎర్రగుంట్ల స్మార్ట్ కిచెన్ భవనాన్ని సందర్శించారు. సాయంత్రం ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని దర్శించుకుని పర్యటన ముగించారు. కడప జిల్లా చారిత్రక వైభవానికి, ఇక్కడి ప్రజల ఆప్యాయతకు తాము ఫిదా అయ్యామని అసిస్టెంట్ కలెక్టర్లు సంతోషం వ్యక్తం చేశారు. పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్లు సిహెచ్. శ్రవణ్ కుమార్ రెడ్డి, హరిఓం పాండ్య, జిల్లా ఆదిత్య శర్మ, నమ్రత్ అగర్వాల్, పవన్ తేజ ఏఆర్, ప్రియా, సుయాస్ కుమార్, వెంకటేష్ బన్నలతో పాటు జిల్లా పర్యాటక అధికారి సురేష్ కుమార్, స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## పోరుమామిళ్లలో అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్



పోరుమామిళ్ల (కడప మనస్సాక్షి): పోరుమామిళ్ల పట్టణ ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ నూతనంగా నిర్మించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ (జ×) కార్యాలయాన్ని, అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. అంతకుముందు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ.. రికార్డులను పరిశీలించి, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలన్నింటినీ ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. దీని ద్వారా పట్టణ పరిస్థితులను ఎప్పటికప్పుడు నిఘా నీడలో పర్యవేక్షించనున్నారు. ఈ సందర్భంగా సీతారామపురంకు చెందిన మాక్స్ సంస్థ ప్రతినిధులు సామాజిక బాధ్యతగా పోలీస్ శాఖకు డ్రోన్ కెమెరాను విరాళంగా అందజేయగా.. ఎస్పీ స్వయంగా దాని పనితీరును పరిశీలించి సంస్థ ప్రతినిధులను సన్మానించారు. అలాగే సీఐ కార్యాలయ నిర్మాణానికి సహకరించిన మేఘా కన్స్ట్రక్షన్స్, ఇతర దాతలను సత్కరించారు. జాతీయ రహదారి విస్తరణ వల్ల ఏర్పడిన ట్రాఫిక్ సమస్యను సంబంధిత శాఖలతో మాట్లాడి పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రకాష్ బాబు, డీఎస్పీలు సుధాకర్, రాజేంద్రప్రసాద్, సీఐ హేమసుందర్ రావు పాల్గొన్నారు.

## ఇనగలూరులో అలరించిన వీధి కళాకారుల సర్కస్ విన్యాసాలు

తొండూరు (కడప మనస్సాక్షి): "కూటికోసం కోటి విద్యలు" అనే సామెతను నిజం చేస్తూ, ఒక వీధి కళాకారుల బృందం తొండూరు మండలం ఇనగలూరు గ్రామంలో శుక్రవారం తమ అద్భుత ప్రతిభతో అందరినీ అలరించింది. గ్రామంలోని వీధుల్లో ఈ బృందం ప్రదర్శించిన సర్కస్ విన్యాసాలు, చిన్న చిన్న ఆటలు చిన్నారులతో పాటు గ్రామస్థులకు కనువిందు చేశాయి. పిల్లలు, పెద్దలు పెద్ద సంఖ్యలో చేరి ఈ విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. పొట్టకూటి కోసం సొంత ఊరు, ఇల్లు వదిలి గ్రామగ్రామం తిరుగుతూ, జనం ఇచ్చే చిల్లర డబ్బులతోనే తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని ఈ సందర్భంగా ఆ కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నాలజీ యుగంలో సాంప్రదాయ వీధి కళలు కనుమరుగవుతున్న తరుణంలో, ఇంకా ఈ కళలను నమ్ముకుని జీవిస్తున్న వారిని చూసి గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ.. తమకు తోచిన ఆర్థిక సాయాన్ని అందించి ఆదరించారు.

## కూటమి ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలు నిర్వీర్యం: ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



పులివెందుల (కడప మనస్సాక్షి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అన్ని రంగాలు నిర్వీర్యమై పేదవాడికి సంక్షేమం అందడం లేదని, 'బాబు వస్తే జాబు వస్తుందన్న' ఆశ అడియాసలయ్యిందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా వైఫల్యాలపై పులివెందులలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి. ఓల్డ్ ఎమ్మెల్యే కార్యాలయం నుండి వైయస్సార్ సర్కిల్ మీదుగా ఆర్డీవో (=ఞా) కార్యాలయం వరకు ఈ నిరసన ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రంలో అభివృద్ధి కంటే రాజకీయ కక్షసాధింపులకే ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో "రెడ్‌బుక్ పాలన" పేరుతో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులను కూడా పూర్తి చేయడంలో ఈ ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందుల ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన తీర్పు ఇచ్చి, వైఎస్ జగన్ నాయకత్వాన్ని మళ్లీ నిరూపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి, వైయస్ మదన్ మోహన్ రెడ్డి మరియు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్స్ పంపిణీ: పులివెందుల డీఎస్పీ మురళి

పులివెందుల (కడప మనస్సాక్షి): మండుతున్న ఎండల్లో రోడ్డుపై నిలబడి విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు పులివెందుల ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి సమ్మర్ కిట్లను పంపిణీ చేశారు. కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఉత్తర్వుల ప్రకారం, పులివెందుల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ బుక్కే మురళి నాయక్ చేతుల మీదుగా 23 మంది సిబ్బందికి ఈ కిట్లను అందజేశారు. ఈ సమ్మర్ కిట్లలో టోపీలు, చలువ కళ్ళద్దాలు (సన్‌గ్లాసెస్), మాస్కులు, ఓఆర్ఎస్ (ూ=ూ) ప్యాకెట్లు మరియు వాటర్ బాటిళ్లు ఉన్నాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మురళి మాట్లాడుతూ.. వేసవి కాలంలో తీవ్రమైన ఎండ, వడగాల్పుల మధ్య ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలు నిర్వర్తించడం ఎంతో కష్టంతో కూడుకున్నదన్నారు. ఈ కిట్లు సిబ్బందికి ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించి, విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పడతాయని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది వడదెబ్బకు గురికాకుండా తరచూ నీరు, ఓఆర్ఎస్ తాగుతూ ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలని, అదే సమయంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వేసవిలో తమకు అండగా నిలిచిన ఎస్పీ, డీఎస్పీలకు పోలీస్ సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ట్రాఫిక్ సీఐ జి.ప్రసాద రావు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

పులివెందుల (కడప మనస్సాక్షి): పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక జ్యేష్ఠ మాసము చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం చౌడేశ్వరి అమ్మవారు విశేష పూల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10:30 గంటలకు భక్తులు రాహుకాల దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్, అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ.. ప్రతి శుక్ర, పౌర్ణమి, అమావాస్య రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర వడిబాల (వడిబియ్యం), కుంకుమార్చన, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. ముఖ్యంగా ఆది, మంగళ, శుక్రవారాలతో పాటు పౌర్ణమి, అమావాస్య రోజుల్లో ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి, 108 పసుపు కొమ్ముల మాల సమర్పిస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకమని పేర్కొన్నారు. ప్రతి పౌర్ణమి రోజు సాయంత్రం ఆలయ ప్రాకారోత్సవం అనంతరం భక్తులకు అల్పాహార ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుంతలమయం.. ప్రమాదాలకు నిలయంగా మారిన మ్యాన్‌హోల్స్



పులివెందుల (కడప మనస్సాక్షి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో మ్యాన్‌హోల్స్ మూతలు పగిలిపోయి, రోడ్లు గుంతలమయంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా 17వ వార్డు పరిధిలోని ఎస్‌బీఐ (ూదీ×) కాలనీ సచివాలయం దగ్గర, అలాగే రిలయన్స్ ట్రెండ్స్ పక్క వీధులలో ఉన్న మ్యాన్‌హోల్స్ మూతలు పలుచోట్ల పూర్తిగా ధ్వంసమయ్యాయి. కొద్దిపాటి వాన పడినా ఈ గుంతలన్నీ నీటిమయం అవుతుండటంతో అటుగా వెళ్లే పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ గోతులను గుర్తించడం మరింత కష్టంగా మారుతోందని, ఏ క్షణంలో ఏ పెద్ద ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు త్వరితగతిన స్పందించి, ధ్వంసమైన మ్యాన్‌హోల్స్‌పై కొత్త మూతలు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డు గుంతల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నవధాన్యాల కిట్లు సిద్ధం: అందుబాటులో 120 కిట్లు

వేముల (కడప మనస్సాక్షి): రసాయన వ్యవసాయం వల్ల నిస్సారంగా మారిన భూములను పునరుజ్జీవింపజేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఎంతో ఉత్తమమైనవని నిపుణులు పేర్కొన్నారు. వేముల మండలం బెస్తవారిపల్లి గ్రామంలోని శివమనోహర్ రెడ్డి బయో రిసోర్స్ సెంటర్ (ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం) నందు రుతుపవనాల కంటే ముందుగా విత్తుకునేలా (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) 120 నవధాన్యాల కిట్లను సిద్ధం చేసి రైతులకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. రైతులు తమకున్న ఖాళీ బీడు భూముల్లో ఈ నవధాన్యాలను విత్తుకోవాలని సూచించారు. పంట 65 రోజుల పూత దశకు వచ్చాక, కొంత భాగాన్ని పశువుల మేతగా వాడుకుని మిగిలిన వ్యర్థాన్ని భూమిలోనే కలియదున్నడం వల్ల నేల సారం పెరుగుతుందన్నారు. దీనివల్ల ప్రధాన పంటకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలతో పాటు కర్బన శాతం మెరుగుపడుతుందని వివరించారు. మండల ఉపాధి హామీ అధికారి మాట్లాడుతూ.. ఇలాంటి పద్ధతుల ద్వారా సాగు పెట్టుబడి తగ్గి మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ లు కృష్ణయ్య, వెంకటేష్, అంజన్ రెడ్డి, ఐసీఆర్‌పీ శివమనోహర్ రెడ్డి మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



వేముల (కడప మనస్సాక్షి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు షరీఫ్ ఆహ్వానం మేరకు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఉర్దూ ఘర్ షాదీ ఖానాను సందర్శించారు. గురువారం జరిగిన వివాహ వేడుకను పురస్కరించుకుని, షరీఫ్ కుమారుడు లతీఫ్ దంపతులను శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. నవదంపతులు పరస్పర అవగాహనతో నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆశీర్వదించారు. ఎంపీ అవినాష్ రెడ్డి రాకపై షరీఫ్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు సాదర స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కొకటం వెంకట బయపురెడ్డి, మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణయ్య, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు గౌస్పీరా, కో-ఆప్షన్ మెంబర్ మండి మాఫీ రా మరియు కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొని నవవధూవరులను దీవించారు.

Editor, Printed, Published and Owned by VASANTHA SREENIVASULA REDDY, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 51600. RNI REG NO:- APTEL/26/A0309.
Printed at. VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. Editor: VASANTHA SREENIVASULA REDDY, E-mail: sreenu1167@gmail.com, Cell: +91 8341698284